క్లుప్తంగా

పోలీసు సిబ్బంది రక్తదానం

ప్రత్తిపాడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రక్తదాన కార్యక్రమంలో ప్రత్తిపాడు స్టేషను సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ రవీంద్రతో పాటు కానిస్టేబుల్ కరీం, సిబ్బంది రక్తదానం చేశారు. అదేవిధంగా ప్రత్తిపాడు ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండ్ యువకులు, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ యువకులను అభినందించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు.

అంగన్‌వాడీల సమస్యలపై దృష్టి సారించాలి



ప్రత్తిపాడు: అంగన్‌వాడీల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఏపీ రాష్ట్ర కన్వీనర్ టి.జ్యోతిరాణి అన్నారు. గుంటూరు నేతాజి నగర్‌లో శుక్రవారం అనారోగ్యంతో మరణించిన అంగన్‌వాడీ కార్యకర్త ఉమకు శనివారం ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంతాపం తెలిపి, నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జ్యోతిరాణి మాట్లాడుతూ ఉద్యోగం చేస్తూ మరణించిన అంగన్‌వాడీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తే వారి కుటుంబాలకు భరోసా దక్కుతుందని తెలిపారు.


నేడు మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహావిష్కరణ

పొన్నూరు: పట్టణంలోని వెంకటేశ్వర భవన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన భారతీయ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

గుంటూరు రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం చట్టపరంగా నేరమని ఆవిధంగా మద్యం సేవిస్తే చట్టపరంగా శిక్షార్హులని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లవెంట, నిర్జన ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వివాదాలకు పాల్పడుతున్నారని, ఇది అలుసుగా తీసుకుని కొందరు సంఘ విద్రోహక శక్తులు అరచకాలు సృష్టిస్తుంటారన్నారు. ఎవ్వరూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, సేవిస్తే వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగించటం జరుగుతుందని సీఐ తెలిపారు.

సింహగర్జన విజయవంతం చేయాలి



పొన్నూరు: గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న నూర్ బాషా - దూదేకులు ముస్లిం సింహ గర్జనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని నిడుబ్రోలులో సంఘ కార్యాలయంలో సంఘం తెనాలి అధ్యక్షుడు కోటి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్య వర్గ సమావేశంలో శంకరరావు పాల్గొని మాట్లాడారు. దూదేకులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. అనంతరం సింహ గర్జన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. నూర్ బాషా సంఘం మండల అధ్యక్షుడు షేక్ షఫ్రూ, మండల కార్యదర్శి మీరావలి, కోశాధికారి ఎస్.సైదులు పాల్గొన్నారు.

250 మంది మందుబాబులపై కేసులు

నగరంపాలెం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ సూచించారు. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశాల మేరకు శనివారం గుంటూరు నగరంలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారికి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. తద్వారా ప్రమాదాలకు గురైన ఇరువురి కుటుంబాలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో 250 మందిపై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికే సురక్ష

- నంబూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన
- ప్రత్యేక వైద్యులచే 426 మందికి వైద్యసేవలు



నంబూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ టి.శ్రీనివాసరావు, పరిశీలిస్తున్న తహసీల్దార్ పి.రత్నం, సర్పంచి నంబూరు జ్యోతి

పెదకాకాని: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, తహసీల్దార్ పి.రత్నం, సర్పంచి నంబూరు జ్యోతి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాల్లో సాధారణ జబ్బులతో పాటు బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ళఅద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేకమన్నారు. ఈ శిబిరం ద్వారా 426 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 250 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 189 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నారు. పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి.శ్రీనివాస్ పర్యవేక్షించారు. సెప్టెంబరు 30వ తేదీన పెదకాకాని మండలంలోని ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారంతో ముగిశాయి. సూపరింటెండెంట్ బీవీ మల్లేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని పాల్గొన్నారు.



నంబూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వేచిఉన్న ప్రజలు



40వ డివిజన్‌లో మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి

పెద పలకలూరులో...

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య రక్ష ప్రజల ఆరోగ్య రక్షణ కార్యక్రమం అని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. శనివారం 40వ డివిజన్ పరిధిలోని పెదపలకలూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం వైద్యులు ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పలువురికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి



మంచాలలో దివ్యాంగుడికి కళ్లజోడు పెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తిగా సేవాకార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మంచాలలో 361 మందికి కళ్లజోళ్లు అందజేత

చేబ్రోలు: చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి పేరుతో వైద్య శిబిరాలను నిర్వహిస్తోన్నట్టు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్య సేవలను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. వైద్యశిబిరంలో మంచాల, శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాలకు చెందిన 423 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్నట్లు గుర్తించిన వారందరికీ కేవలం 6 రోజుల్లోనే, మొత్తం 361మందికి కళ్ళజోళ్లను అందించడం జరిగిందన్నారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని, ఇప్పటివరకు సుమారు 9,139 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 6,865 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని అంబటి మురళీకృష్ణ వివరించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు చెబుతూ, జగనన్న చిత్ర పటాలను ప్రదర్శించారు.

ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించండి

తహసీల్దార్ జి. సిద్ధార్థ



మాట్లాడుతున్న తహసీల్దార్ జి. సిద్ధార్థ, పక్కన ఇన్‌చార్జి ఎంపీడీఓ మోషే

ప్రత్తిపాడు: సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ మావులూరి మోషే అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా లబ్ధి చేకూరుస్తుందన్నారు. వలంటీర్లు ముందుగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తమ ఇంటికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. అంతేకాకుండా అర్హత ఉండీ పథకం అందని వారు ఎవ్వరైనా ఉంటే వారిని గుర్తించి పథకం వారికి వర్తించేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సిబ్బంది కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

ఎన్నికల సంవత్సరం అప్రమత్తంగా ఉండాలి..

ప్రస్తుతం ఇది ఎన్నికల సంవత్సరమని, మనమంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సిద్ధార్థ సూచించారు. విధుల్లో ఏ చిన్న పొరబాటు జరిగినా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అందుచేత ఓటర్ల మార్పులు, చేర్పులు స్పెషల్ డ్రైవ్‌లపై అలసత్వం వహించవద్దని చెప్పారు. మోషే మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో అర్హత ఉండీ పథకానికి దూరంగా ఏ ఒక్కరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ రామకోటయ్య, సెక్రటరీలు, సచివాలయ ఫంక్షనరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తలరాత మార్చనున్న అతివ

- పొన్నూరు నియోజకవర్గంలో మహిళల ఓట్లే అధికం
- నియోజకవర్గంలో 2,24,034 మంది ఓటర్లు
- పురుషులు 1,07,734, మహిళలు 1,16,282



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ హరిహరనాథ్

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో మహిళల ఓటు శాసనంగా మారబోతుంది. ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. మహిళల ఓటు నేతల తలరాతను మార్చబోతుంది. ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం 2,24,034 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషుల కంటే 8,540 మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీల నేతలకు ఓటరు నమోదు అధికారులు అందజేశారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో నాలుగు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు అభ్యంతరాలు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితా విడుదల కానుంది.

పొన్నూరు నియోజకవర్గంలో...

పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లే నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారు. 264 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,24,034 మంది ఓటరు నమోదు అధికారులు ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,07,734, మహిళలు. 1,16,282, థర్డ్ జెండర్ 18 మంది ఉన్నారు.

పెదకాకాని మండలంలో..

33,094 మంది మహిళలు, 30,303 మంది పురుషులు, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు.

చేబ్రోలు మండలంలో..

30,782, మంది మహిళలు, 29, 108 మంది పురుషులు, ఏడుగురు థర్డ్ జెండర్లు ఉన్నారు.

పొన్నూరు పట్టణంలో..

26, 239 మంది మహిళలు, 23, 750 మంది పురుషులు, ఆరుగురు థర్డ్ జెండర్లు ఉన్నారు.

పొన్నూరు రూరల్‌లో..

26 167 మంది మహిళలు, 24, 573 మంది పురుషులు, ఒక థర్డ్ జెండర్ ఉన్నారు.

నియోజకవర్గంలో మొత్తం 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో పొన్నూరు పట్టణం 55, చేబ్రోలు 71, పెదకాకాని మండలం 74 పోలింగ్ కేంద్రాలు ఉండగా వివిధ కారణాలతో వాటిలో 27 కేంద్రాలకు ప్రాంగణాల మార్పు చేశారు. మరో 14 పోలింగ్ కేంద్రాలకు పేరు మార్పు జరిగింది. పెదకాకాని మండలంలో 6 పోలింగ్ కేంద్రాలు, చేబ్రోలు మండలంలో 6, పొన్నూరు మండలంలో 7, పొన్నూరు పట్టణంలో 8 పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. చేబ్రోలు మండలంలో 8, పొన్నూరు మండలంలో 6 పోలింగ్ కేంద్రాలకు పేర్లు మార్పు చేశారు.

క్లెయిమ్స్ దాఖలు చేయాలి



ప్రకటించిన ముసాయిదా జాబితాలో పొరపాటున ఓటు కనబడకపోయినా, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లినా, వివాహం వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లినవారు జాబితా చూసుకొని సంబంధిత క్లెయిములు దాఖలు చేయాలి. నవంబరు 4, 5 డిసెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక శిబిరాల్లో బూత్ లెవెల్ ఏజెంట్లను సంప్రదించాలి. ఓటరు సంబంధిత అంశాలపై ప్రతి మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నాం.

– కేదార్నాథ్ శ్రీకాంత్, సహాయ ఓటరు నమోదు అధికారి

రైతులు ఈ-పంట జాబితా పరిశీలించాలి

పెదకాకాని: రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఈ పంట నమోదు జాబితాను పరిశీలించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నంబూరు గ్రామంలో శనివారం ఈ పంట నమోదు లిస్టుల సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ఏఓ పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు జాబితాలో తమ పేరు , వేసిన పంట, విస్తీర్ణము, పంట రకం తదితర వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఏమైన సవరణలు ఉంటే అక్టోబరు 30వ తేదిలోగా రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులకు అర్జీ పెట్టుకుని తప్పులు సరిచేసుకోవాలన్నారు. తద్వారా ఈ పంట యాప్‌లో చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ-పంట నమోదులో పేర్లు లేనివారు పంట నష్టం, పంట ఇన్స్యూరెన్స్, పంటను అమ్ముకోవడానికి అనర్హులన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నష్టపోకుండా ముందు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓ రెడ్డి శివాజీ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వేధింపుల భర్త, అత్త మామలపై కేసు

గుంటూరు ఈస్ట్: వివాహితను భర్త, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు దూషించి బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోరంట్లకు చెందిన వాసంతి. ఒంగోలుకు చెందిన ఫణి దంపతుల మధ్య విభేదాలు వచ్చాయి. వాసంతి భర్త, అత్తమామ, ఇతర కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసింది. ఈనెల 26న ఇరు కుటుంబ సభ్యులు దిశ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. అనంతరం బయటకు వచ్చి న తరువాత అరవింద ఫణి, అతని తల్లిదండ్రు లు, బంధువులు వాసంతిని బెదిరించి దుర్భాషలాడారు. శనివారం వాసంతి పోలీసులకు ఫిర్యా దు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడిలో చోరీ ఘటనపై కేసు నమోదు

గుడిలో పూజారిని మోసం చేసి సీతమ్మవారి మంగళసూత్రాలు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంపత్‌నగర్‌లోని రామాలయం మందిరానికి ఈనెల 26న భక్తుడుగా ఓ వ్యక్తి వచ్చాడు. పూజలు పూర్తయిన అనంతరం పూజారికి రూ. 500 నోటు ఇచ్చి రూ. 100 తీసుకుని రూ. 400 తిరిగి ఇవ్వాలని కోరాడు. పూజారి సత్యమోహనరావు చిల్లర తీసుకొచ్చేందుకు గుడి నుంచి బయటకు వెళ్లాడు. ఇంతలో ఆ వ్యక్తి సీతమ్మవారి మెడలోని పది గ్రాముల రెండు మంగళసూత్రాలు తెంచుకుని పరారయ్యాడు. సత్యమోహన్‌రావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత్ కాల్ సమయం కీలకం



ఐఆర్‌టీఎస్ అధికారి దినేష్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: యువత వారి ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి, దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దటానికి 2022 సంవత్సరం నుంచి 2047 వరకూ మధ్య గల 25 సంవత్సరాల అమృత్‌కాల్ సమయం కీలకమని ఐఆర్‌టీఎస్ అధికారి దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఇండియా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యంగ్ థింకర్స్ ఫోరం సంయుక్తంగా న్యూ ఇండియా ఇన్ అమృత్‌కాల్ ఇయర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఐఆర్‌టీఎస్ అధికారి, ఇండియన్ రైల్వే గుంటూరు డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ దినేష్‌కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడు ప్రాధాన్యతలతో కూడిన అమృత్‌కాల్ ప్రణాళికను నిర్దేశిస్తూ 2022–23 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ, నూతన ఆవిష్కరణలకు ఆర్థిక మద్దతు తెలుపుతుందన్నారు. అమృత్‌కాల్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దడంలో యువత పాత్రపై ఐఆర్‌టీఎస్ అధికారి దినేష్‌కుమార్, కన్వీనర్ ట్రిపుల్ ఐటీ కర్నూలు అధ్యాపకుడు డాక్టర్ కె.వెంకటకృష్ణారావు, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌లు ఈ సదస్సులో చర్చించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.వై.భానుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9 లోపు అభ్యంతరాలు స్వీకరించాలి



అధికారులతో సమావేశమైన ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితాపై డిసెంబర్ 9వ తేదీలోపు అభ్యంతరాలను తీసుకొని పరిష్కరించాలని బీఎల్‌ఓలను నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో ఎన్నికల విధుల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 27వ తేదీకి ఓటర్ల ముసాయిదా జాబితా విడులైందని, అందులో వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి, తుదిజాబితాతో తప్పులు లేకుండా వచ్చేలా చూడాలన్నారు. సూపర్‌వైజరీ అధికారులు తమ పరిధిలోని బీఎల్‌ఓల వారిగా వచ్చే అభ్యంతరాలను నేరుగా పరిశీలించాలన్నారు. అభ్యంతరాలను ఎన్నికల విభాగంలో బీఎల్వోల వారిగా రికార్డు నమోదు చేయాలని ఆ విభాగం సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నగరంలోని ఓటర్లు నేరుగా తమ ఓటుని సంబంధింత బిఎల్‌ఓ, పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్‌లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

పల్లెకు పోదాం విజయవంతం చేద్దాం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెక్రటరీలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: ప్రతివార్డు సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం విజయవంతానికి కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పీవీకే భాస్కర్ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్లెకు పోదాం కార్యక్రమ నిర్వహణపై సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 9 నుంచి డిసెంబర్ 8 వరకు అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో పల్లెకు పోదాం అనే కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు సచివాలయాల్లో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, రానున్న పథకాలను స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలకు తెలియజేయాలన్నారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డ్స్ పథకాల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి ఇంకా ఎవరికైనా అందకుండా ఉంటే వారికి వెంటనే అందించేందుకు దోహదపడుతుందని, కార్యదర్శులు, వలంటీర్లు కార్యకమం గూర్చి స్థానిక ప్రజలకు తెలియచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే సచివాలయాల వారిగా నోడల్, సూపర్వైజరీ అధికారులను నియమించామన్నారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య పాల్గొనారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలతో లక్ష్మీనారాయణ, రవి శ్రీనివాస్

పాత గుంటూరు: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, పురాతన సంపదలను పరిరక్షించి భావితరాలకు అందించడమే లక్ష్యంగా ఇంటాక్ సంస్థ పనిచేస్తుందని ఇంటాక్ రాష్ట్ర కో-కన్వీనర్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన ఇంటాక్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను లక్ష్మీనారాయణ ప్రారంభించి మాట్లాడారు. ఇంటాక్ సంస్థ ద్వారా శిథిలావస్థకు చేరిన అనేక పురాతన కట్టడాలను అభివృద్ధి పరిచి, వాటి చారిత్రక వైభవాన్ని ప్రజలకు వివరిస్తూ, వాటి ఆవశ్యకతలను విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఎ.రవి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని జిల్లాలనుంచి విద్యార్థులు క్విజ్ కాంపిటీషన్ పాల్గొని రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి క్విజ్ కాంపిటీషన్స్ పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి విజేతలుగా నిలిచిన విశాఖపట్నం విద్యార్థులు నైతిక్ పవార్, సాయికీర్తనలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు అడపా వేణుగోపాల్, కె.వి.బ్రహ్మం, సుబ్రహ్మణ్యం, సీతారమేష్, రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వాల్మీకి జ యంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీ కి మహర్షి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దేవానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాల కుడు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి పాల్గొన్నారు. ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించగా, ఆయన చిత్రపటానికి ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు(ఏఆర్), ఎ.శ్రీనివాసరావు(క్రైం)లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐలు థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాజారావు, రాఘవయ్య, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.